వెతికాయి. రక్తం ముద్దకి కొస్త దూరంగా సిన్నిగాడు వెతుకుతున్నది కనపడింది. అది దూరంగా తెగిపడిన పెంటిగాడి చెయ్యి. ఆ చేతిలో గుప్పెట్లో బిగించిన రొట్టెముక్క!! సిన్నిగాడు ఒక్క ఉరుకున అక్కడికి దూకి ఆ చేతిలోంచి రొట్టె ముక్కతీసి చటుక్కున నోట్లో పెట్టేసుకున్నాడు.

అబ్బ - ఎంత ఘోరం - ఇంత చిన్న రొట్టె ముక్కకి ప్రాణం 'కాపాడే శక్తేకాదు, తీసే శక్తీ వుందని యివాళే తెల్సింది అనుకున్నారంతా.

('జ్యోతి' సౌజన్యంతో)

★

# అరటి తొక్క

నాలుగురోడ్ల జంక్షన్ దగ్గిర - బిజీ బజారు సెంటర్లో కోటమ్మ కిళ్ళీకొట్టు ముందు కోటమ్మ-వీర్రాజు ఘోరాతి ఘోరంగా బూతులు తిట్టుకుంటూ జుత్తులు పట్టుకుని కొట్టుకుంటున్నారు. చుట్టూ చేరిన జనం ఏ గారడినో, సర్కసో చూస్తున్నంత కుతూహలంగా, ఆనందంగా తిలకిస్తున్నారు ఆ పోట్లాట—

'దొంగనచ్చినోడా - ఆడకూతుర్ని. దిక్కుదివాణం లేనిదాన్ని కిళ్ళీబడ్డీ ఎట్టుకుని నాలుగు రాళ్ళు తెచ్చుకు గంజినీళ్లు తాగతంటే కళ్లల్లో నిప్పులేసుకుంటావా చుప్పనాతి నంజకొడకా. ఆడకూతురితో తగులడ్డానికి సిగ్గు నేదురా - ఆడకూతురి మీదనట్రా నీ ప్రతాపం ఆ మూతిమీద మీసం తీసేసి చేతికి గాజులు ఏసుకోరా ఎదవా—' అంటూ తుపుక్కున ఊసింది.

'నీవాడకూతురివా, ఆడకూతురివైతే యింటికాడ కూకుని బుద్ధిగా వన్నం వండుకోవాలి, పిల్లల్ని సాకోక్కవాలి-యిలా నడిరోడ్డు ఎక్కి- కిళ్ళీబడ్డీ ఎక్కి కూకుని దారంటేపోయే మగాల్లందరితో కులుకులాడతవే గుడిసేటి నంజా—' వీర్రాజు తక్కువ తినలేదన్నట్టు కాండ్రించి ఉమ్మేసాడు.

'ఏట్రా....ఏట్రా పేలతన్నావు నీ జిమ్మడ-గుడిసేటినంజనా....' రొప్పుతూ విడినజుట్టు ముడివేసుకుని అమ్మవారిలా, అపరకాళి అవతారం ఎత్తింది కోటమ్మ-

'నీ పెళ్ళం నంజ - నీ అమ్మ గుడిసేటి. నంజ - నీ అప్పసెల్లెళ్లు నంజలు, ... కోటమ్మ నోరిప్పితే మరి మాతపడదు - వీర్రాజు మూడుతరాల ఆడవాళ్ళందరిని లంజలు, ముండలు చేశాక - సుట్టూ జనంవంక తిరిగింది - 'అయ్యలు, బాబులు- చూశారా ఆడకూతుర్నట్టుకు ఎంతెంత మాట లంటున్నాడు. మొగుడు సచ్చినోడు వాగ్గేసిపోతే ఆడకూతుర్ని ఏ బతుకు తెరువు నేక యీ కిల్లీ కొట్టెట్టుకు గంకనీళ్ళు తాగతంటే సూడనేక కళ్ళు కుట్టుకుని కొట్లకుక్కలా కలియబడతన్నాడు పీడి బిమ్మడ'- మెటికలు విరిచింది.

"ఓయమ్మ - నీ నంగనాచి కబుర్లు నాకాడ సెప్పకు - గంజినీళ్ళ ఖర్మ నీకేటి - సానిపాపలా సింగారించుకుని, కొట్టెక్కి కూకుని దారినపోయే మగాల్లందరికి వగలుచూపి యాపారం సేసే నీకు గంజినీళ్ళం ఖర్మ - యీ సీరలు, జాకెట్లు ఆ కంపెనీ బాడీలు, ఆ గాజులు, పూసలు, ఆ సింగారం సూడండి బాబూ గంజినీళ్ళు తాగతందట—తాగే, ఆ గంజినీళ్ళు కూడా నేకుంటా మా నోట్లో దుమ్ము కొట్టి....కోపంతో ఉడికిపోతూ వీర్రాజు.

'సాతకాని నన్నాసి - నామీదపడి ఏడవకపోతే, కొట్టుమీద నీ పెళ్ళాన్ని కూకోపెడతానంటే నా నొద్దన్నానా....సుప్పనాతి నంజాకొడుకులు-' మరోసారి ఉమ్మేసింది 'మాటలు తిన్నగా రానీ నేదంటే మక్కెలిరగ దన్నగలను - నంజ కొడుకులు యిక్కడెవరూ లేరు - నంజికూతురు తక్క. మా ఆడోళ్ళు పరువు మర్యాదగలవోరు-నీలా బరితెగించిన బజారురకాలు గాదు....'

'ఓ యబ్బ పతివతలన్నమాట, మరింకేం ఆ పతివత పెళ్ళాం వుండగా నీకు గంజేం ఖర్మ-వండకుండానే చేతులాడించి పంచభక్ష్య పరమాన్నాలు వడ్డిస్తది పరేదుపెందుకురా నన్నాసి—' చూసిన పతివ్రతల సినిమా నాలెడ్జితో హేళనగా ఎత్తిపొడిచి జోకు ఎలా వుందన్నట్టు చుట్టూ చూసింది కోటమ్మ - ఘొళ్ళున నవ్వారు అందరూ - వీర్రాజు అవమానంతో వీరావేశం వచ్చి ముందుకురికాడు కోటమ్మ మీదకి. అంతదాక వినోదిస్తున్న జనం వ్యవహారం ముదిరి పాకాన పడిందని గ్రహించారు. నలుగురైదుగురు మగాళ్ళు వీర్రాజుని వెనక్కి లాగారు.' ఆడ కూతురుతో నీకేటి అసలేటయింది?- ఏటసలు గొడవ....' అంటూ వీర్రాజుని అడిగారు. వీర్రాజు ఆవేశంగా రొప్పుతూ- 'అసలేటయిందా, దాన్నే అడగండి - బాబూ....అరటితొక్క....అరటితొక్క బాబూ....దాని గురించి తగూ బాబూ....' అంతకంటే చెప్పలేకపోయాడు ఆవేశంతో.

'అరటి తొక్క!' జనం ఆశ్చర్యంగా 'అరటితొక్కేమిటి?' అని తెల్లబోయారు.

అవును, అరటితొక్క - ఎందుకూ పనికిరాని అరటితొక్కే యీ తగవుకి కారణం అదెలా? ఆ కథ ఏమిటయ్యా అంటే....

*        *        *

మూడు నెలల్రితం—నాలుగు రోడ్ల కూడలిలో బజారు సెంటర్లో కాకులమధ్య హంసలా....కిళ్ళీకొట్ల మధ్య కోటమ్మ కిళ్ళీకొట్టు వెలిసింది - వున్న అరడజను కిళ్ళీకొట్లలో కోటమ్మదే ఆడ కిళ్ళీకొట్టు - ఆ కిళ్ళీకొట్టు వెలిసిందగ్గరనుంచి మిగతా కిళ్ళీషాపులకి గిరాకి పడిపోయింది. పువ్వుమీద వాలే తుమ్మెదలా ప్రతివాడు కోటమ్మ కిళ్ళీషాపుకే రావడం ఆరంభించారు - అంతమంది మగవాళ్ళమధ్య ఆడది కోటమ్మ అప్సరస కాకపోవచ్చు - కాని కోటమ్మ నలుపులో మెరుపుంది - ఎత్తుగ బలంగ పుష్టిగా పోతపోసిన యినప విగ్రహంలా నిగనిగలాడుతూంటుంది. టెరి కాటన్, ఫుల్ వాయిల్ నైలాను చీరలు కట్టి కంపెనీబాడీ, మాచింగ్ జాకెట్టు తొడిగి, రంగు రంగుల బొట్లు-గోళ్ళకి పాలిష్-తలలో పూలు - నీటుగా తయారై కొట్టెక్కి కూర్చుంటే చూడని మగాడిది తప్పు - వేషమే కాదు నడకలో. మాటలో. నవ్వులో ప్రత్యేకతుంది-మాటలో గడుసుదనం వుంది-నవ్వులో కొంటెతనం వుంది-చూపుల్లో కవ్వింపుంది.

ఇన్ని వున్న కోటమ్మని మొగుడెందు కొదిలేశాడన్నది ఎవరికీ తెలియదు—తెల్సినవాళ్ళు కొందరు మొగుడు దీన్ని వదలలేదు-ఇదే మొగుడ్ని వదిలేసిందంటారు-చవటసన్నాసి దీని జాణతనం ముందు ఆ నోటి ధాటికి తాళలేక పారిపోయాడంటారు-

సన్నాసి పారిపోగానే కోటమ్మ కిళ్ళీ కొట్టెక్కేసింది - సన్నాసి కూర్చునున్నాళ్ళ సన్నాసి మొగం ఏం చూస్తాం అన్నట్టు కిళ్ళీకొట్టు దరిదాపులకి వెళ్ళని వాళ్ళందరూ కోటమ్మ కిళ్ళీకొట్టు ఎక్కగానే బెల్లంచుట్టూ చేరిన చీమల్లా తయారయ్యారు. తక్కిన కిళ్లీషాపులకి లేని గిరాకి తన షాపుకి ఎందుకొచ్చిందో గ్రహించలేని చిన్నదీ కాదు. వెర్రిది కాదు కోటమ్మ-ఆ అవకాశాన్ని జారవిడిచేటంత పతివ్రతా కాదు! పోలీసులని కాకా పట్టింది. కుర్రకారుతో హాస్యాలాడింది - లారీ డ్రైవర్లు, బస్సు డ్రైవర్లు, క్లీనర్లతో, రిక్షావాళ్ళతో అన్నా, మావా. బావా అంటూ వయసులు చూసి వరసలు కలిపింది—'బాబ్బాబూ, అరువెట్టకు బాబూ. ఆడకూతుర్ని లెక్క డొక్క రానిదాన్ని పైనలిచ్చేయండి-బాబూ' అంటూ కుర్రకారుని బతిమిలాడి మంచిగా తెలివిగా అరువులు లేకుండా వ్యాపారం చేసుకుంది — మూడ్నెల్లకే వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా మారగానే పాత వాయిల్ చీరల్లోంచి ధగధగలాడే పల్చటి సిల్కు కోకలు, కంపెనీ బాడీలకి దిగింది - రాబడితో

పాటు సోకు పెరిగింది-సోకుతోపాటు కులుకులు-కులుకులతో జాణతనం పెరిగింది. ఆ సెంటర్లో కోటమ్మ కిళ్లీకొట్టు పెద్ద ఎట్రాక్షన్ అయి కూర్చుంది నాలుగు నెలలకే!

వీర్రాజు వీరత్వం యింకో దాన్లోవున్నా మానినా పిల్లలని కనడంలో కన పరిచాడు. ఏడుగురు సంతానం—పదిహేనేళ్ళ నించి ఏడాది వరకు వున్న పేరు శనగ కాయల్లాంటి పిల్లలు, బాలింత చూలింత తప్ప మామూలుగా ఎప్పుడూ కన పడని పెళ్లాం, ముసలి తల్లి వీళ్ళందరికి వీర్రాజు కిళ్లీ కొట్టే ఆధారంగా వుండేది—రోజుకి పదిరూపాయలు కళ్ళ చూసేవాడు—ఖర్చులుపోగా నాలుగో ఐదో మిగిలితే తిని తిననట్టు ఏదో గుట్టుగా సంసారం లాక్కొచ్చాడు యిన్నాళ్ళు.

యిప్పుడు—అంటే నాలుగు నెలలనించి, కోటమ్మ కిళ్లీకొట్టు ఎక్కాక వీర్రాజు పని డౌన్ అయిపోయింది. బేరాలు లేక, సరుకు చెల్లక రోజుకి రెండు రూపా యలుకూడా కళ్ళబడకుండా పోయింది. బేరాలు పడిపోవడానికి కారణం కోటమ్మ అన్నది అర్థం కావడానికి రెండునెలలు పట్టింది వీర్రాజుకి. అర్థం అయ్యాక పళ్ళు కొరుక్కుని కోటమ్మని పచ్చిబూతులు మనసులో తిట్టడం మినహా మరేం చెయ్యాలో అర్థం కాలేదు. ఇంటి దగ్గర పెళ్ళాం పిల్లలు పస్తులుంటున్నారు. అంతమందిని ఏంపెట్టి ఎలా పోషించాలో అర్థంగాక వీర్రాజు కిందామీదా పడుతున్నాడు ఇంట్లో అమ్మదగ్గ బిందె, చెంబులు నడిచివెళ్ళాయి. కొట్లో షోడామిషన్, నిలువుటద్దం, బెంచీలు, ఒక్కొక్కటే వచ్చిన ధరకి తెగనమ్మడం మినహా మరే దారి లేక పోయింది. వీర్రాజు మొహం చూసి అప్పిచ్చే తల మాసినవాడు ఎవడూ కనపడ లేదు. కొట్టు తాకట్టుపెట్టి ఏభై తెచ్చి ఓ నెల తిన్నారు. పిల్లల మొహాలు పీక్కుపోయాయి - ఆకలి చూపులతో ఏం దొరుకుతుందా ఎగరేసుకు పోదామా అని చూడడం తప్ప మరో పని లేకుండా పోయింది వాళ్ళకి.—ఆకలితో నీర్సంగా నాలుగు బేరాలు రావా అన్నట్టు కొట్టుమీద కూర్చుంటాడు వీర్రాజు — అర్ధశేరు నూకలన్నా కొనడానికి డబ్బు దొరకదా దాంతో గంజిపోస్తాను అనుకుంటూ ఆశగా గుమ్మంలో కూర్చునేది పెళ్ళాం—ఆశ నిరాశ అయిపోగా, పిల్లలు అస్థిపంజరాలుగా తయారవు తుంటే చూడలేక పెళ్ళాం పాచిపనికి కుదిరింది—పెద్దవాడు కాఫీహోటల్లో కుదిరి వాడి తిండి ఏర్పాటు వాడు చూసుకున్నాడు-చాతకాని వాడిలా చేతులు ముడుచు కూర్చుని పెళ్ళాం యీ యింట ఆ యింట పనిచేసి తెచ్చే చద్దిమెతుకులు తినడానికి అభిమానం అడ్డువచ్చేది వీర్రాజుకి. చాతకానితనంతో ఉక్రోషం ముంచుకువచ్చి ఎదురుగా కోటమ్మ కులుకులు తళుకులు చూస్తూ ఉడికిపోయేవాడు! కొట్టుమీదనుంచి లాగి నడి రోడ్డుమీద నిలబెట్టి మొహాన పేడనీళ్ళు కొట్టాలన్నంత కసిగా వుంది. కోటమ్మని కిళ్ళీకొట్టు ఎందుకు పెట్టావు అనడగడానికి హక్కులేదు కనుక కోపం దిగమింగు కుని కసి పెంచుకుని కనిపించినపుడల్లా తుపుక్కున ఉమ్మి-నోట్లో దుమ్ముకొట్టింది,

దీని సిగతరగ అంటూ మెటికలు విరిచి పిల్లిమీద ఎలకమీద పెట్టి తిట్టి సంతృప్తి పడేవాడు.

నాలుగు నెలలు గడిచేసరికి మరిమంచి రోజులు వస్తాయన్న ఆశ నిరాశగా మారిపోయింది వీర్రాజుకి. అతని సంసారం కుక్కలు చింపిన విస్తరి అయింది. అతని పిల్లలు వీధిన పడ్డారు.

ఆ రోజు....గత రెండు రోజులుగా పిల్లలకి గంజినీళ్ళు తలా గ్లాసుడు తప్ప ఘనపదార్థం కడుపులో పడలేదు- ఆ గంజినీళ్ళూ పడి ఇరవై గంటలయింది. బిక్కమొహాలతో, ఆకలి చూపులతో తండ్రికొట్టు దగ్గిరకొచ్చి నిలబడ్డారు. పిల్లలకి పెట్టేందుకు చివాట్లు తప్ప ఏమిలేవు వీర్రాజు దగ్గిర. తన అశక్తత కళ్ళముందు నిలుస్తుంటే చికాకు కోపం ముంచుకువచ్చి "వెధవల్లారా - ఏడుపుగొట్టు వెధవల్లారా, ఇక్కడ మీకేం పనిరా పొండి.... ఎల్లండి యింటికాడ కెల్లండి-ఎదవ మొగాలు, ఎప్పుడు సూసినా ఆకలితప్ప మరేటినేదు-పొండెహె-" అని తిట్టితరిమాడు, అసలే ఆకలిమీద బిక్కచిక్కిన వీర్రాజు కోపంగా. పిల్లలు భయపడి పారిపోయారు. పారిపోయింది యింటికికాదు- తండ్రి కన్నుచాటుచేసి, తమ కడుపుకొట్టిన కోటమ్మ కిళ్ళీబడ్డీ దగ్గిరకెళ్ళి నిలబడ్డారు. కోటమ్మని తల్లి తండ్రి తిట్టే తిట్లు పిల్లలకీ తెల్సు-ఆ కోటమ్మని ఎందుకు తండ్రి తిడ్తాడో అదీ తెలుసు-ఆ కోటమ్మవల్లే గంజినీళ్ళకయినా గతిలేకుండా వీధిన పడాల్సివచ్చిందనీ తెల్సు-తెల్సినా కోటమ్మ కిళ్ళీబడ్డీ దగ్గిర నిలబడానికి కారణం అరటిపండ్లు! కుళ్ళిపోయిన అరటిపండ్లు, పిల్లలు అటువక్కగా వెడ్తూంటే కోటమ్మ వేలాడదీసిన గెలల్లోంచి తిట్టుకుంటూ మాగిపోయి నల్లబడి అమ్మకానికి పనికిరాని అరటిపండ్లు తీసి పడేస్తుంది. వచ్చిన నష్టాన్ని తలుచుకుని ఉసూరుమంటూ—పిల్లల ఆకలి కళ్ళకి ఆ కుళ్ళిపోయిన అరటిపళ్ళు పంచభక్ష్య పరమాన్నాలయ్యాయి. నల్గురూ గమ్మునురికి మహదానందంగా, ఆబగా తొక్కలు వల్చుకుని మాగిపోయిన పళ్ళు తిన్నారు. ఆకలికడుపులకి కాస్త ఆహారం పడగానే ఆకలి మరింత విజృంభించింది-కుళ్ళిపోయిన అరటిపళ్ళ దగ్గిరే కొట్టుకొచ్చిన వీళ్ళూ వాళ్ళూ తినిపడేసిన అరటిపళ్ళ తొక్కలు-పచ్చగా నిగనిగలాడుతూ కనిపించాయి. ఆ తొక్కలు తీసుకొని ఆబగా అవి నాక్కుంటూ గుజ్జు తినసాగారు. తింటున్న వాళ్ళ కోటమ్మ కళ్ళబడ్డారు. ఆ కుచేల సంతానం వీర్రాజుదని తెలుసు. వీర్రాజు తనని ఎలా దుమ్మెత్తి పోస్తున్నదీ తెల్సు-తెల్సినా ఎదురుదెబ్బ కొట్టడానికి సమయం కోసం చూసింది. ఆ సమయం దొరికిందిప్పుడు. "ఛీ....ఛీ వీళ్ళ జిమ్మడ-దిక్కుమాలిన సంత-మేకల్లా అరటితొక్కలకి ఎగబడ్డారు. గుంటెదవలు-తిండెట్టుకోలేని వాళ్ళు, పందుల్లా యింతమందిని ఎవడు కనమన్నాడు-కనిపారేసి రోడ్ల మీదకి తరుముతారు-మాయదారి సంత పొండెహె-మీ బాబుగాడి సొమ్ము యిక్కడనేదెహె-గుంటెదవలకి

సిగ్గునేకపోతే పెద్దోళ్ళ కుండాలి—కళ్ళల్లో నిప్పులేసుకునే ఎదవకి నా అరటి తొక్కలే కావాల్సివచ్చినయి గామోసు-" వ్యంగ్యంగా, హేళనగా, కసిగా, కోపంగా, ద్వేషంగా వీర్రాజు వంక హేళనగా చూస్తూ గట్టిగా అరిచింది, కోటమ్మ అరిచాక ఆ తిట్లకి గురి అవుతున్నదీ తను, తన పిల్లలు అని తెలిశాక చరచర వచ్చి పిల్లల్ని చితక పొడిచాడు-బూతులు తిట్టాడు- "సిగ్గులేని ఎదవల్లారా-ఆ నంబికూతురి అరటితొక్కలే గతిరా మీకు, ఎల్లండిరా దాని పెరట్లో యింత అశుద్దం తినండిరా....సావకూడ దర్రా యింతకంటె-" కోపం, ఉక్రోషం, అవమానం ముంచెత్తగా పిల్లల్ని, కోటమ్మని కలిపి తిట్టాడు-పిల్లలు బిక్కచచ్చి నిలబడ్డారు-కోటమ్మ తక్కువ తిన లేదు-అన్నాళ్ళ కసీ తీర్చుకుంది-చిలికి చిలికి గాలివాన అయిందీ-జనం మూగారు- "అదీ బాబు,.... పిల్లెదవలు ఆకలి గాకనేక కక్కుర్తిపడి ఆ అరటితొక్కలు తిన్నారు.... దానికి బాబూ యింత రాద్దాంతం-మా కడుపులు కొట్టింది-యీ మా తల్లి ధర్మమాని పిల్లలు రోడ్డంట పడ్డారు." వీర్రాజు బాధగా, ఆవేదనగా చెప్పాడు- అంతా కోటమ్మ వంక చూసారు. అందరి సానుభూతి వీర్రాజు మీదకి తిరిగిందని గ్రహించలేని వెర్రిది కాదు కోటమ్మ-క్షణంలో ప్లేటు ఫిరాయించింది. "అది కాదు బాబూ-యింటికాడ మేకల్ని పెంచుతున్నాను-యీ తొక్కలట్టే కెళ్ళి ఆటికి పడేయా లని...."

"అబద్దాలు బాబూ-మేకలెక్కడనించి నొచ్చినాయి-నాకు తెల్దూ"-వీర్రాజు గుయ్ మన్నాడు. కోటమ్మ మళ్ళీ అందుకుంది-యిద్దరి దెబ్బలాటలో సారాంశం వినేశాక చుట్టూ జనానికి కుతూహలం పోయింది. మెల్లగా కదిలారు- "సాల్లెండెహె అరటితొక్కల కోసం సిగలట్టు కున్నారు యిద్దరూ-ఎల్లండి....ఎల్లండి మరి ఊరు కోండి"-అని సర్ది చెప్పేశారు నలుగురైదుగురు-

* * * *

తెల్లారి ఆరుగంటలకి కళ్ళికొట్టు తీయడానికి వచ్చిన కోటమ్మ ముందురోజు కళ్ళి బడ్డిముందు పారేసిన కుళ్ళు అరటిపండు మీద కాలేసి జర్రున జారి దబ్బునపడి నడుం విరగ్గొట్టుకుంది-ఆస్పత్రి పాలయింది.

అపకారమే కాదు అవసరం అయితే ఉపకారం చేయగలదని ఎందుకు పనికి రాని అరటితొక్క తనకింత ఉపకారం చేసినందుకు వీర్రాజు సంతోషం చెప్పనలవి కాదు. 'కనీనం మూడు నెలలు తన బేరాలకి ఢోకా లేదు—' నమ్మకంగా అను కున్నాడు.

('స్పందన వాణి' సౌజన్యంతో)

★